140

# సూరి సిద్ధాంతం

అప్పుడే వచ్చిన ఆంధ్రపత్రిక పేజీలు తిరగేస్తూ 'ఈ హారిజన సమస్య మొత్తంమీద జనాన్ని అల్లకల్లోలం చేస్తున్నదిరా సూరీ' అన్నాను.

సూరి బద్ధకంగా నవ్వి "జనానికి అల్లకల్లోలం కావటం చాలా యిష్టమని నీకు తెలుసునా!" అన్నాడు.

నాకు కోపం వచ్చింది.

"నీకు దేన్నిచూసినా గౌరవం లేదురా, సూరీ" అన్నాను.

"ఒకరికున్నట్టు!"

"మత గురువులంతా చూడు యెంత ఘోష పెడుతున్నారో!"

"పులి విస్తరాకుదగ్గిర కాకులూ, ఎముకల దగ్గిర కుక్కలూ, బహిర్దేశాలలో పందులూ గోల చేసినట్టు!"

"మతాన్ని వాటితో పోలుస్తావా!"

సూరి బిగ్గరగా నవ్వటం మొదలుపెట్టాడు.

"యిందులో హాస్యం నా కర్థం కావటంలేదు" అన్నాడు తీక్షణంగా.

సూరి వినిపించుకోకుండా "పోలిక, మతానికి వాటికీ కాదు, మత గురువులకూ వాటికి!" అని మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాడు.

తెలుగులో తిట్టటానికి వుండదగినన్ని మాటలు లేవు. ఆ వున్నవాటినే రెండు మూడు వరసలు ప్రయోగించిన మీదట సూరి దారికి వచ్చాడు.

"ఒరే నీకున్న మెదడే బహుకొద్ది, ఆ కాస్తాకూడా పాయిజనయి పోయింది. నువ్వు మెంటల్‌గా చచ్చినవాడికింద లెక్క."

"ఎందువల్ల ? నీ మాదిరిగా పవిత్రమైన విషయాలను హేళన చెయ్యను గనకనా?"

"పవిత్ర మేమిట్రా, నీ మొహం! నీ దే మతం!"

"అలా అడగటంలో నీ అభిప్రాయం యేమిటి?"

సూరి నావైపు వేలుపెట్టి చూపిస్తూ, "చూశావా ! అంత చిన్న ప్రశ్నకు కంగారుపడకుండా సమాధానం చెప్ప లేవు. నువు మెంటల్‌గా చచ్చావంటే యెందుకు యెగిరి పడ తావు ?"

"నాది హిందూమతం" అన్నాను గర్వంగా.

"అంటే నీకు ఆ మతాన్ని చూస్తే గౌరవమనా? లేక నీకు దాన్నిగురించి ఏమైనా తెలుసునా?"

"కావలిస్తే నాకు హిందూమతాన్ని గురించి ఏమీ తెలీదని వొప్పుకుంటాను. కాని నా పూర్వులది హిందూ మతం. నా తండ్రులదీ, తాతలదీ,నాదీ ఆ మతమే!"

మళ్లీ సూరి నవ్వటం మొదలుపెట్టాడు.

"ఎందు కా వెధవనవ్వు?"

"ఏమిట్రోయ్ ! మతంకూడా [నవ్వు] ఆస్తుల్లే— గుణాలల్లే - రోగాలల్లే [నవ్వు] హెరిడిటరీగా—సారీ! - వంశ పారంపర్యంగా [నవ్వు] వస్తుందా ఏమిట్రోయ్ ! హా ! హా! హా ! హా !"

"ఏమిటా తెలివితక్కువ ప్రశ్న ? యెందుకు రా కూడదు ?"

సూరి తన నవ్వును ఒక్క దెబ్బతో స్విచాఫ్ చేసు కుని పెద్ద గుడ్లుచేసి నావంక చిత్రంగా చూడటం మొదలు పెట్టాడు.

"యేమట్లు చూచెదవు?"

"మరేం లేదు, మనిషి జ్ఞానాని కంతుందికాని అజ్ఞానానికి లేదు."

సూరి ఆ మాట అన్నతరవాత నాకు చాలా సిగ్గేసింది. వాడి పద్ధతులు అభిప్రాయాలూ నాకు విపరీతంగా కన పడవచ్చుగాక, వాడి తెలివెక్కడ నా తెలివెక్కడ. నేను వాడితో ఇంతసేపు నాకేమీ తెలీని విషయాన్ని గురించి వాదించటమేమిటి ? వర్ణాశ్రమ ధర్మాలనీ, ఆచారాలనీ, నీ

తనీ.మతమనీ అందరూ అంటుంటే విని సంభాషణలో వాటిని గురికి ఒకమైలు అటూ ఇటూగా ప్రమించటమే కాని వాటిని గురించి నాకేం తెలుసు ? నేను తెల్లజండా యెత్తి సంధికి జొరబడ్డాను.

"ఇదంతా ఎందుకన్నాని సూరీ మతం, ఆచారాలు మొదలైన వాటిని గురించి నీకు తెలిసింది చెప్పు వింటాను' అన్నాను.

"విను, చెబుతాను, నీకూ జంతువుకూ భేదం ఏమిటి?"

"అదెందు కిప్పుడు?"

"ఒరే ! ప్రశ్నకు సమాధానం చెప్పటానికి అంత గందరగోళ మెందుకురా ! ఆ వెధవగుణం మానెయ్యి. చెప్పు ?"

"ఏముందీ ! మనం నిలువుగా నడవగలం. ఇంకా — ఇంకా - వెధవది ఒక్కటీ జ్ఞాపకం రాదేం!"

సూరి నాకడ్డం వచ్చాడు.

"నిలువుగా నడిచి నువ్వొందరగా ఉన్నదేంలేదు. ఆ భేదాలన్నీ నేనే చెబుతాను.నువ్వు మాట్లాడగలవు. అందువల్ల అబద్ధం ఆడటం ఒకటి నేర్చుకున్నావు. రాయటం చాతవును-దొంగదస్కతులు పెట్టడంకూడా చాతవును-ఎవరో అన్నట్టు. సంగీతం పాడగలవు, ఎక్కిరించగలవు. అవన్నీ అలా వుంచి నీకూ జంతువుకూ కల ముఖ్యమైన భేదం చెప్పు"

"నాకు తెలీదు"

"నీకు బుద్ధి వుంది! జంతువుకు లేదు!"

"కావచ్చును. కాదనను"

"అది అలావుంచు. నీ దగ్గిరవున్న వస్తువులన్నీ నువు ఉపయోగిస్తున్నావని వుందా ?"

"లేదు. నా దగ్గిర రేజరుంది. ఒకసారి దాంతో చేసుకునే టప్పటికి మొహంనిండా గాట్లు-"

"సరే ! సరే! అదంతా తరవాత నీ బుద్ధిని నువ్వెప్పుడయినా ఉపయోగించిన జ్ఞాపకం వుందా?"

"అయ్యో ! ఎందుకుపయోగించను! ప్రతిక్షణం-"

"ఒరి మూఢుడా ? నీకు బుద్ధంటే అర్థంకాలేదు. మనస్సనుకుంటున్నావు. మనసు వేరు బుద్ధివేరు. వాళ్లూ వాళ్లూ అనేక విషయాలను గురించి అనుకుంటున్న మాటలన్నీ జ్ఞాపకం వుంచుకుని వాటిని నిజంకింద అంగీకరించి, వాటిప్రకారం ఆచరించటం బుద్ధిని ఉపయోగించటం కాదు. దేన్ని గురించయినా నీ అభిప్రాయం ఒకటి ఏర్పరుచుకున్నావా ? నిజం చెప్పటం తప్పుకావచ్చు నిజంగా ! నువ్వెప్పుడన్నా ఆ విషయం నీ బుద్ధికి పని ఇస్తేగా!"

"ఆఁ! ఆఁ! నీ అభిప్రాయం నాకిప్పుడు చక్కగా తెలుస్తున్నది. ఇక పైకి వెళ్లు"

"ఏసీ ! ఇంగ్లీషును తర్జుమా చెయ్యటానికి నీకూ అభ్యంతరం లేదన్నమాట."

"ఇంతసేపటినించీ మాట్లాడుతున్నాం. మతాన్ని గురించి నువు ఒక్క ముక్క చెప్పలేదు"

"దానికే వస్తున్నాను. నీకు తెలిసినంతలో ఏ జంతువు కైనా మోక్షం వుందా?"

"నాకే మతాన్ని గురించి తెలిసి అఘోరిస్తేగా! జంతువులకు మోక్షం లేదేమో అనుకుంటాను"

"జంతువులకు మతం కావాలా?"

"బహుశా అవసరం లేదు."

"నీవంటి జంతువులు లోకంలో ఎంతమంది ఉన్నా రంటావు?"

"లక్షలు! కోట్లు! సామాన్యంగా నేను తెలివిగల వాడికింద లెక్క! తెలుసా నీ కా సంగతి?"

సూరి నవ్వాడు.

"తెలుసును. వీళ్ళందరికీ మతంతో ఏమీ అవసరం లేదని తెలుసుకో. వాళ్ళంతా ఆహారం, నిద్రా, మైథునం స్టేజి దాటలేదు. ఆ మూడూ వాళ్ళ కిప్పిస్తే మతం ఏమైనా వాళ్ళకు తొందరలేదు. సంఘం యేం చేస్తున్నది? వాళ్ళ కా మూడూ అందకుండా చేస్తున్నది. మత గురువు లేం చేస్తున్నారు? వాళ్ళకు మతం యిస్తున్నారు. వాళ్ళకు మతం సరయిన ఆహారం కాకపోవటంవల్ల అనేక జాడ్యాలు బయలు దేరుతున్నై. సూపర్‌స్టిషన్ అనేది ఈ తరగతి జాడ్యమే. బలులు, యజ్ఞాలు, సంతర్పణలు, లక్షవత్తుల దీపాలు, లక్ష

ప్రతి పూట-తిండికి రోజుకు అణా డబ్బులు దొరక్క ఒక చెంప కొంతమంది మాడుతుంటే!

"నీ మతం ఎంత దరిద్రపు మతమంటే, ఒకచెంప వంశ పారంపర్యంగా వస్తూనూ వుంటుంది, నువ్వు పిలక కత్తిరించి, క్రాపింగు పెటినప్పుడూ, బూటూ సూటూ వేసినప్పుడూ, వితంతువును వివాహం చేసినప్పుడూ, నీ స్నేహితులతో భోజనం చేసినపుడూ, చివరకు స్టీమరెక్కినప్పుడూ పోయి మళ్లీ ఎలాగో నీ దగ్గిరికి తిరిగి వస్తూ వుంటుంది. ఇవాళ శూద్రవాళ్ళతో అన్నం తింటే మతం పోయింది కదా, రేపు విధవా వివాహం చేసుకుంటే ఏమనటానికి వీల్లేదు ఈ లోపల అప్పుడే మతం మళ్లీ వచ్చి వుంటుంది."

"ఇంకో చిత్రం చూడు. నేను మతానికి ప్రచారం లేదంటాను."

"అది నేను వప్పుకోను. బుద్ధుడు, శంకరుడు, క్రీస్తు వివేకానంద, మహాత్మాగాంధి, అంతా ప్రచారం చేసిన వాళ్ళే"

"అందుచేత నేను నా బుద్ధికి తోచినమాట అనకూడదంటావా?"

"సూరీ నువ్వు తెలివికలవాడివి కావచ్చుగాక.శంకరాచార్యులూ, క్రీస్తూ, మహమ్మద్-వీళ్ళకంటెనా?"

"ఎందుక్కాకూడదురా ? స్వరాజ్యం, స్వేచ్ఛ అని గొంతు బొంగురు పొయ్యేదాకా అరుస్తారే!నా బుద్ధికి వాళ్ళ బుద్ధులకు దాస్యం చెయ్యమన్నావా ! మతం హిస్టరీ అను

కున్నావా, జాగ్రఫీ అనుకున్నావా బోధ చెయ్యటానికి ? బుద్ధుడి మతం తీసుకున్నవాళ్ళలో మరొక్క బుద్ధుడున్నాడా? నిజమయిన క్రైస్తవుడు క్రీస్తొకడేనా ? యింకొకడున్నాడా ? అర్జునుడి తరవాత జీవితంలో భగవద్గీత అర్థం చేసుకున్నవాడి లక్షణా లేవైనా వున్నవా ? పైగా ఈ మతాలు ప్రచారం కావటానికి యెంత నెత్తురు ప్రవహించిందో తెలుసునా? ఇదంతా ఎందుచేత?"

"మిగిలినవాళ్లు పశుప్రాయులు కావటంచేత నే సంటావు. కావచ్చును. కాదనను. సరేకాని ఈ విషయం నీ కొక్కడికే తట్టటం యెందుకు ? ఇంకెవ్వరూ యెందుకు గ్రహించలేదు?"

"ఇంకెవ్వరికీ తట్టలేదని ఎలా చెప్పగలవు ? లోకంలో వున్న పుస్తకాలన్నీ చదివావా?"

"మనకు తెలిసినంతలోనే"

"నిజానికి ఈ విధంగా చెప్పినవాళ్లెవరూ లేరు. కాని ఎవరికీ తట్టదనేది పొరపాటు. నేను నిరుద్యోగిగా వున్నాను. కనక ఈ విషయం మాటాడుతున్నాను నీతో. లేకపోతే నాకేం పట్టింది నీ తప్పులు దిద్దేటందుకు?"

"ఎవడికైనా మతం కావలిసొస్తే?"

"వున్న మతాలను గురించి చదువుతాడు. తన మతం సృష్టించుకుంటాడు. నా చొక్కాలు నీ కెలా సరిపోతై?ఇంకో చిత్రం చూడు. చాలామంది అభిప్రాయం ఆచారాలే మత మని."

"మతాన్ని తృణీకరించావు. ఆచారాలనుగురించి నీ అభిప్రాయం ఏమిటి? వాటిని చూస్తే నీకు గౌరవం వుందా?"

"ఆ."

"మా తాతి గావంచా నువ్వుపయోగిస్తావా?"

"నా కెలా పనికొస్తుంది?"

"సి, చిరిగి రూపుమాసిపోయిన ఆచారాలు నా కెలా పనికొస్తై? ఆచారమనేది కేవలం పనిముట్టు. మనిషి ఉపయోగం కోసం యేర్పడ్డది. ఆచారం కాని మనిషి ఆచారం కోసం యేర్పడ్డవాడు కాడు. అని నువ్వెందుకు గ్రహించవు? నీ కే బుద్ధివుంటే. చిన్నతనంలో భర్తపోయిన పిల్లకు తిరిగి పెళ్ళిచెయ్యి, నువ్వెంతవరకు పశువువో ఆ పిల్లా అంతేను. ఆమెకూ సంసార సుఖం కావాలి అని' నీ కింకెవరో చెప్ప వలిసిన అవసరం యేముంది? నువ్వు నిర్బంధం చెయ్యక పోతే ఆ పిల్ల యింకో భర్తను చూసుకోదా? నీకు బుద్ధి లేదు కనకా, నీ బుద్ధిలేక పోవటం ఇతర ప్రాణులకు అపాయ కరంగా వుంది కనకా నీ మీద ప్రచారం చెయ్యాలి. గాంధీ మహాత్ముడు చేసే ప్రచారం అదే. నీకు నిజంగా లాభించే ఆచారాలు నువ్వుంచుకో. రోజుకు పది స్నానాలు చెయ్యి. మడిగట్టుకో. సంధ్యవార్చు, తద్దినాలు పెట్టు. ఎవ్వరికీ అప కారం లేదు."

"మాలవాళ్లను ముట్టుకోవటం విషయం?"

"మాలవాళ్లను ముట్టుకోకు, బ్రాహ్మణ్ణి కూడా

ముట్టుకోకు, ముట్టుకోమని ఎవరన్నారు? వాళ్ళతో కలిసి భోజనం చెయ్యకు ఎవరితోనూ కలిసి భోజనం చెయ్యకు. భోజనం చెయ్యటం చాలా రహస్యమయిన పని. కాని వాళ్ళను వెలి వెయ్యటం ఎందుకు! నీ బావిలో వాళ్ళు నీళ్లు తోడితే నీ ప్రాణం యేం పోయింది? వాళ్లు నీ యిళ్ళ మధ్య ఎందుకు నడవరాదు? అంత వాడితో సంబంధం లేకుండా వున్న వాడిని నీ తెగిన చెప్పులు వాడి మొహాన యెందుకు పారెయ్యటం? నీ చచ్చిన గొడ్లు వాడికెందుకు వప్పగించటం? వాడి కూతుళ్ళకు నువ్వెందుకు కన్ను గొట్టటం? వాడే ఎవరిధర్మానో చక్రవర్తిని అధికారిగా వస్తే వాడికి షేక్ హాండు చెయ్యటం ఎందుకు? ఏం ఆచారంరా? నీ మొహం ఆచారం! నీ శరీరంలో యే మాలవాడి నెత్తురూ లేదని యేమిటి నిదర్శనం?"

"ఒరే అటువంటి మాటలంటే నే నూరుకోను"

"మాటవరస కన్నానురా! నువ్వంటే నువ్వని కాదు. నీ ఆచారాలన్నీ తెగి దాళ్ళుపడి పోయినవని నమ్ముతావా?"

"నమ్ముతాను కాని, సూరీ! కొన్ని కొన్ని ఆచారాలకు వ్యతిరేకంగా నడవటం అవినీతి కాదా!"

"హాఁ. నీతినిగురించి మాట్లాడుతున్నాడండీ గుంటడు. ఇది నీతి, ఇది నీతికాదు అని రాసిపెట్టి వుందా ఏమిటి?"

"ఎందుకు లేదు"

"నీతంటే ఏమిటని నీ అభిప్రాయం?"

"ఈ మధ్య ఒకాయన రాసినవ్యాసం చదివాను

లేరా. ఆడవాళ్ళ ఎదుట బూతు మాట్లాడటం అవినీతి, అవునా!"

"అవును. ఆ మాటలు వుప్పర ఆడవాళ్ళ దగ్గిరా, దొమ్మర ఆడవాళ్ళదగ్గిరా మాట్లాడటం అవినీతేనా ?"

"కాకపోవచ్చును"

"కాకపోవచ్చు నేమిటి ? కాదు. ఒక దేశంలో మగవాడు అయిదు నిమిషాలకో భార్యను చేసుకున్నా స్నీతి బాహ్యంకాదు. ఏమంటావు?"

"అవును లే. మన దేశం ఇంకా అంత-"

"యేడిచావు లే. పసికూనకు పెళ్ళిచేసి వెంటనే మొగుడు పోతే 'అమ్మాయి, నీ కర్మం ఇలా కాలింది కనక నువ్వు సంసార సుఖం కోరావా నీతి మాలినదాని వవుదావు. కనక మాఅందరి తృప్తికోసం నువ్విలాగే పడుండు' అంటావా యేమిటి ? కొంతమంది సంఘ సంస్కారులు చూస్తాను కదా, కాపరానికి పోకపూర్వం వైధవ్యం తటస్థించిన పిల్లల పునర్వివాహం విషయమే లెక్కచ్రిస్తారు, ఒక సంవత్సరం,పది సంవత్సరాలు, కాపరం చేసిన మనిషికి సంసార సుఖం అక్కర్లేనట్టు."

"ఎందుచేత ?"

"పది సంవత్సరాలు కాపరం చేసిన దానికి మళ్లీ పెళ్ళి చెయ్యమంటే అంతా తిరగబడి మాడు పగలగొడతారేమోనని. ఎవత్తై యేళ్లది కానీ తిరిగి పెళ్ళి చేసుకుంటానంటే తప్పేమిటంట. ఇష్టమయినవాడే వస్తాడు."

"ఒరే సూరీ. నువ్వు పడమటికన్నా పడమటవుతు న్నావు. సంఘం యే స్థితి కొస్తుందో ఆలోచించు."

"వీరంతా కలిసి సంఘాన్ని ఉద్ధరిస్తున్నట్టు, నీకు ఓపిక వుంటే ఒక తమాషా సంగతి చెబుతాను విను. నే నెరిగిన ఒక కుర్రవాడుండేవాడు. తలిదండ్రులు చిన్నతనంలోనే పోయినారు. దరిద్రుడు. ఎక్కువ తెలివిగలవాడు కాడు. ఒక రిద్దరు పెద్దమనుష్యులు పూనుకుని వాడికి వారాలు ఏర్పాటు చేసి స్కాలర్షిప్పిప్పించి చదువు చెప్పించారు. వాడు క్షిప్రఘోరం చదువుతూ సరిగా పరీక్షలకు ముందు చచ్చేటంత జబ్బుపడి ఎలాగో బతికాడు కాని పరీక్ష పోయింది. హెడ్‌మాస్టరొక పిగ్ హెడెడ్ రాస్కెల్. స్కాలర్షిప్పివ్వనన్నాడు. వాడికి మొదట్లో సహాయం చేసిన ఒకరిద్దరూ చచ్చిపోయినారు. ఈ జబ్బులో వారాలు పోయినై. ఇక చదువుకునే ఆశ వదులు కుని వాడు మాతా మహుడుగారింటికి పోయినాడు.

"వాడి పినతల్లి ఒకమ్మాయి వుండేది. పెద్ద మని షయింది. కాపరానికి పోలేదు. వాడూ ఈడొచ్చిన పిల్ల వాడు. అక్కడికి పోయినప్పటినించి వాడు ఆ పిల్లతో ఫ్లిర్టింగ్ మొదలుపెట్టాడు తనకు తెలీకుండానే. ఆ పిల్లా వాణ్ని అడ్డగించలేదు. ఇద్దరూ ఒకచోట కూర్చుని ఆలో చనలు చేసేవాళ్లు, ఇంకోళ్లు చూసినా తిట్టటానికి వీలు లేనంత దగ్గిరగా కూర్చునేవాళ్లు. ఏదో నెపంమీద ఒకళ్ళ నొకళ్లు తాకేవాళ్లు. ఒకళ్ల వెంట ఒకళ్లు పరిగెత్తేవాళ్లు. ఇలా కొంతకాలం గడిచిపోయింది. ఒకరోజున ఆ కుర్రవాడు కొద్దిగా లిమిట్ దాటాడు. ఆ పిల్ల ఎదురుతిరిగి తిట్టింది. అంద

రితో చెప్పింది. అందరూ వాణ్ణి తిట్టారు. వాడుకూడా వాణ్ణి తిట్టుకుని, పశ్చాత్తాపపడి - పశ్చాత్తాపమంటూ ఒకటి ఉన్నట్టు - అక్కణ్నించి లేచి పట్టణంవచ్చాడు తిరిగి వాడు చేసిన పనిసిగురించి నీ వ్యాఖ్యానం ఏమిటి?"

"నా వ్యాఖ్యానమేముంది! నే నైతే వాణ్ని చొక్కా విప్పి చర్మం పొంగేటట్లు తాటి మట్ట తీసుకొని కొడుదును"

సూరి కొంచంసేపు మౌనంగా కూర్చుని, కథ సాగించాడు.

"ఎవరూ వాడికి ఉద్యోగం ఇవ్వలేదు ఎవరో ప్లీడరు గారు దయదలిచి వాడికి తనదగ్గిర వాలంటీరు పని ఇచ్చాడు. అక్కడ కొంతకాలం పనిచేసిన తరవాత వాడి కా మోసం, అబద్ధాలు, దుర్మార్గం చూస్తే అసహ్యం వేసింది. అక్కణ్నించి చెప్పకుండా లేచిపోయినాడు. దానిమీద నీవ్యాఖ్యానం ఏమిటి?"

"ఫూల్. కావాలంటే ప్లీడరు గుమాస్తాగా వుండి న్యాయంగా వుండకూడదా ఏమిటి?"

సూరి చిరునవ్వు నవ్వాడు.

"వాడికి చివరకొక్కటి తోచింది. మనం బ్రాహ్మణ కులంలోపుట్టాం. విధ్యుక్తకర్మ చేతా మనుకున్నాడు. బ్రాహ్మణార్థాలు చెయ్యటం మొదలుపెట్టాడు. తద్దినం మంత్రాలూ అవీ నేర్చుకున్నా."

"భేష్. మంచిపని చేశాడు" అన్నాను.

"ఆ కుర్రవాణ్ణి గురించి నాకు తోచిందికూడా చెబుతాను. వింటావా?"

"చెప్పు"

"నేను రొండే విషయాలు చెప్పదలుచుకున్నాను. మొదటిది: రేపు చెట్లూ చామలూ మనల్ని గురించి తెలుసుకోటం మొదలుపెట్టి అవికూడా మనల్ని అనుకరించాలని ప్రయత్నంచేస్తే నేను తప్పకుండా తప్పు పడతాను."

"రొండోది. మనిషి మూడువిధాలుగా వుంటున్నాడు. పశువుగా, మానవుడుగా, దేవతగా. పశుత్వంలోనూ మంచీ చెడూ వుంది, మానవత్వంలోనూ వుంది, దేవత్వంలోనూ వుంది. [ఈ చివర విషయం బహుశా నీకు తెలీదేమో!] ఇంతవరకూ అందరికీ తెలిసే వుండవచ్చును. అందరికీ తెలీని విషయమేమిటంటే పశుత్వంలో చెడు చాలాకొద్ది, మానవత్వంలో మంచి చెడు చాలాకొద్ది, మానవత్వంలో మంచి చెడూ చెరిసగంగా వుంది, దేవత్వంలో మంచికన్న చెడు చాలా జాస్తి."

ఈ వేదాంతం నాకేమీ అర్థంకాలేదని వేరేచెప్పక్కర్లేదు. కాని వాణ్ని ఎంత వేడుకున్నా సూరి పైన ఒక్క మాటకూడా మాట్లాడకుండా పేపరు తీసుకుని చదవటం మొదలుపెట్టాడు.